# నిశ్శబ్దపు చప్పుడు

**మ**రోసారి కాలింగ్‌బెల్ కొట్టడం కోసం చేయి పైకెత్తుతున్న రాఘవ గడప కవతల కనిపించగానే తెరచిన తలుపును అలాగే చేత్తో గట్టిగా పట్టుకుని శిల్పంలా నిలబడి పోయిందామె. మేఘాలు లేని ఆకాశంలా ఎప్పుడూ నిర్లిప్తంగా కనిపించే ఆమె ముఖంలో కోపమూ, దుఃఖమూ పలచటి దూదిమేఘాల్లా అలా కనిపించి ఇలా మాయమైనట్టు తోచింది రాఘవకు. కాసేపు తానూ స్థాణువులా మారి ఆవిడ ముఖంలోకే చూస్తూ ఉండిపోయిన తర్వాత ఉలిక్కిపడి తేరుకుని, తడారిన పెదవులను నాలుకతో బలవంతంగా విడదీసి, "సారీ రాణీ! నాకు తెలిసింది నిన్న సాయంత్రం అయిదు గంటలకే... రాత్రి తొమ్మిది గంటల బస్సు దొరికింది. అది గంట లేటుగా పదికి చేరిందిక్కడికి... మీ ఇల్లు కనిపెట్టడానికి గంట పైన్నే పట్టింది," అన్నాడు రాఘవ జీరబోయిన గొంతుతో.

"అంకుల్ని కారిడార్లోనే నిలబెట్టేస్తావా మమ్మీ!" అంటూ రాణి వెనక నుంచీ ఓ యువతి గొంతు వినిపించింది. రాఘవ కంగారుపడుతూ అటూ ఇటూ తల తిప్పి చూశాడు. పక్కనున్న ఫ్లాట్ల తలుపులన్నీ మూసే వున్నాయి.

రాణి పక్కకు తప్పుకోగానే లోపలికి వచ్చి సూట్ కేసు పక్కన పడేసి, సోఫాలో కూచుంటూ, "నువ్వెప్పు డొచ్చావు కిరణ్?" అని పలకరించాడు రాఘవ.

ల్యాప్‌టాప్ సంచితో బయటికెళ్లడానికి సిద్ధమై ఉన్న కిరణ్మయి ఎదుటి సోఫాలో కూచుని, "ఇప్పుడు నా జాబ్ ఇక్కడే అంకుల్... సిక్స్‌మంత్సయింది ఇక్కడి కొచ్చి," అంది.

"మరి నీ హజ్బెండు?"

"శ్రావణ్ బెంగుళూరే! ట్రాన్స్‌ఫర్ కోసం ట్రై చేస్తున్నాడు."

గోడపైన పూలమాల వేసి ఉన్న ఫోటోఫ్రేము లోంచీ సీతారామచంద్రమూర్తి సూటిగా తననే చూస్తున్నట్టు అనిపించగానే రాఘవ బెంబేలుపడ్డాడు. మూర్తి ముఖంలో అదే చిరాకు... నవ్వుతున్నాయో, ఎగతాళి చేస్తున్నాయో తెలియని పెదవులు... ఇటే చూస్తున్నా గాలిస్తున్నట్లుగా కనిపించే చూపులు... రాఘవ ముఖం అవతలికి తిప్పుకున్నాడు.

ఉదయపు గాలులు కొన్ని పద్మవ్యూహంలాంటి అపార్టుమెంటులో దారితప్పి తిరుగుతున్నాయి. డ్రాయింగ్‌రూంలోని సోఫా, కుర్చీలూ, టీవీ స్టాండూ రాఘవతో తమకున్న పాత స్నేహాన్ని గుర్తు చేస్తున్నాయి. టీపాయ్ పైన ఇంకా పేజీలు తిప్పని ఇంగ్లీషు దినపత్రిక పిల్లల్ని డొక్కలో ముడుచుకున్న కొంగలా దొంగ ధ్యానం చేస్తోంది. ఏదో అడవిలో కట్టిన ఒంటరి సత్రంలా ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

ఎదురుగా కూచున్న రాణి ముఖంలో ఇప్పుడు అదనంగా రెండు మూడు ముడతలూ, తలపైన నాలుగైదు తెల్ల వెంట్రుకల పాయలూ కనిపించాయి రాఘవకు. పక్కన కూచున్న కిరణ్మయి ముఖంలో ఆమె తల్లిదండ్రుల పోలికలు వెదుకుతూ, “ఎప్పుడూ?” అని ప్రశ్నించాడు రాఘవ.

రాణి ఓ నిమిషం సేపు అతణ్ణి కళ్లార్పకుండా చూసి, ముఖం తిప్పుకుంది.

“నెలరోజులుగా సిమ్లాలో ఉన్నాను విజిటింగ్ ఫెలోగా. తిరిగొచ్చింది నిన్నే! సాయంత్రం బాటనీ డిపార్టుమెంటు బయపరెడ్డి కనిపించి క్యాజువల్‌గా చెప్పాడీ సంగతి. రిటైరైపోయిన తరువాత యూనివర్సిటీకి వెళ్లడం తగ్గిపోయింది. ఒకరినొకరు పట్టించుకునే వాళ్లిప్పుడెక్కడున్నారు?” బలహీనమైన గొంతుతో సంజాయిషీ చెబుతూ వచ్చి, రాణి తటాలున తల పైకెత్తగానే తన మాటలు గురి తప్పుతున్నాయని తెలుసుకుని గబుక్కున ఆగిపోయాడు రాఘవ. తరువాత దీనంగా, “ఎప్పుడు? ఎలా?” అని పాత ప్రశ్ననే మళ్లీ వేశాడు.

“డాడీ ఆరోజు డిన్నర్ తిన్నాక పడుకున్నా రంకుల్!” గొంతులో సన్నటిజీర తొంగి చూస్తున్నా కిరణ్మయి ధైర్యంగానే చెప్పుకుపోయింది. “మార్నింగ్ లేవలేదు. అర్ధరాత్రెప్పుడో హార్ట్ అటాక్ వచ్చిందన్నారు డాక్టరు. ఏదో అసోసియేషన్ ఎలక్షన్లూ... వాళ్ల కజిన్ ఆ పల్లెటూర్లో ఉండే ఇల్లు ఆకుపై చేసుకున్నారని కోపం... పెద్ద ఇష్యూలేంగాదు. అజిటేటెడ్‌గా వున్నారంతే! కానీ...”

మూర్తి ఫోటోకేసి మరోసారి చూశాక గొంతు పెగుల్చుకుని, “సో సారీ రాణీ! లాస్టియరు లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వడం కోసం వచ్చినపుడు కలిశాను, అదే ఆఖరి చూపనుకోలేదు,” అన్నాడు రాఘవ. రాణి కళ్ల చుట్టూ వ్యాపించిన నల్లటి మచ్చలు ఆమెని ముసలితనానికి చేరువ చేస్తున్నట్టుగా ఉన్నాయి. కెరటాలు వెనక్కెళ్లిపోయిన తరువాత కూడా తడి మిగిలించుకున్న ఇసుక ఒడ్డులా ఆ మచ్చలు మినమినా మెరుస్తున్నాయి.

“ఆఫీసు టైమైపోయిందంకుల్! నేను బయల్దేరతాను... సాయంత్రం అర్లీగా వచ్చేస్తాను. ఈలోగా వెళ్లిపోకండి. మీతో మాట్లాడాల్సింది చాలా ఉంది. ఈ ఒక్క రోజైనా మమ్మీకి కంపెనీ ఇవ్వండి,” అంటూ కిరణ్మయి పైకి లేచింది.

రాఘవ మొహమాటపడుతూనే తలూపాడు.

కిరణ్మయి హీలు చెప్పులు డబడబమన్నాయి. కాస్త దూరంలో తలుపులు మూయమని లిఫ్ట్ చెబుతున్న మాటలు... తర్వాత మళ్లీ నిశ్శబ్దం...

సూట్‌కేసును లాగుతూ, “స్నానం చేసి ఫ్రెషప్ కా... గంట పదకొండవుతోంది. టిఫిను రెడీ చేస్తాను,” అంటూ పక్క గదిలోకి దారితీసింది రాణి.

ఫోటోలోని సీతారామచంద్రమూర్తి కసిగా నవ్వుతున్నట్టు తోచడంతో కంగారుగా పైకి లేచాడు రాఘవ.

హైదరాబాదుకు వచ్చిన కొత్తలో మూర్తి అమీర్ పేటలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. రాఘవ వెళ్లి నప్పుడు, 'మీ కజిన్ మన ఇంట్లో ఎందుకు దిగుతాడ్లే రాణీ! హోటల్లో సూట్ బుక్ చేసుంటాడు. లంచ్‌కైనా ఉండమను,' అన్నాడు మూర్తి, 'కజిన్' అనే మాటను వొత్తి పలుకుతూ. అతడి ధోరణి అర్థమయినట్లుగా, 'ఈసారొచ్చినపుడు తప్పకుండా ఉంటాను,' అన్నాడు రాఘవ.

బాత్రూం చూపెట్టి రాణి వెనుదిరిగింది. ఆవిడ నడుస్తూంటే చీర ముడతలు మూల్గుతు న్నట్లుగా శబ్దం చేస్తున్నాయి. తిరుపతిలో చదువుతున్నపుడు రాణి ఎక్కడుంటే అక్కడ సందడిగా ఉండేది. గలగలా మాట్లాడేది. పకపకా నవ్వేది. అనంతపురంలో ఉద్యోగంలో చేరిన కొత్తలో కూడా అలాగే ఉండేది. "బాటనీ లెక్చరరు సీతారామచంద్రమూర్తి ఈమధ్య నీకు బాడీగార్డులా నీ వెనకే తిరుగుతున్నాడు,' అని చెప్పాడు రాఘవ ఒకసారి. 'ఎవరతను? నాకు చూపెట్టు,' అంది రాణి. ఫ్యాకల్టీ క్లబ్బులో పరిచయం చేసినప్పుడు మర్యాదగానే పలకరించింది. అతను వెళ్లిపోయాక, 'ఆ మనిషి చూపులు బాగాలేవు. ఇలాంటివాణ్ణా పరిచయం చేయటం?' అని కసిరింది. నెలరోజుల తరువాత మూర్తి తన దగ్గరికొచ్చి, 'రాణీ నేనూ పెళ్లి చేసుకోబోతున్నాం,' అని చెప్పినప్పుడు ఆశ్చర్యపడ్డం రాఘవ వంతయింది. 'ఏం చేద్దాం? నేనొప్పుకోకపోతే మూర్తి సూయిసైడ్ చేసుకుంటానంటున్నాడు,' అంది రాణి. 'భయపడి ఒప్పుకున్నావా? లేకపోతే ఇష్టపడే ఒప్పుకుంటున్నావా?' అని అడిగాడు రాఘవ. బిడియంగా నవ్వి, 'వాళ్ల పేరెంట్స్ వస్తున్నారు. మా అమ్మానాన్నను కూడా రమ్మన్నాను,' అంది రాణి. మూర్తిది ప్రకాశం జిల్లాలో ఏదో పల్లెటూరు. రాణిది కోయంబత్తూరు. 'ఆరోజుల్లోనే మా అమ్మానాన్నది రెవల్యూషనరీ మ్యారేజి. నేను పుట్టిందేమో చెన్నయ్. పెరిగింది వైజాగ్. పీజీ, పిహెచ్‌డీ తిరుపతి. నేనసలు సిసలైన కాస్మోపాలిటన్,' అనేది రాణి. ఆమె నాన్ వెజిటేరియన్ కావడం అడ్డంకి కాదు పొమ్మన్నాడు మూర్తి. పెళ్లయిన మూడోరోజున డిన్నరు కెళ్లినపుడు, 'మూర్తితో నువ్వు నాకు కజినవుతావని చెప్పాను. నువ్వూ ఆ మాటే చెప్పు,' అంది రాణి. రాఘవ అయోమయంగా చూశాడు. 'మీ పేరెంట్స్ మా ప్రాంతం నుంచి మైగ్రేట్ అయ్యారని చెప్పాన్లే!' అందామె మూలుగులాంటి నవ్వుతో.

రాఘవ స్నానం చేసి వచ్చేసరికి టిఫిను సిద్ధంగా ఉంది. డైనింగ్ టేబుల్ ముందు కూచున్నాక, "మీ సిస్టర్ వచ్చి వెళ్లిందా?" అని అడిగాడు.

రాణి తల ఊపుతూ, "ఇప్పుడు త్రివేండ్రంలో వుంది. కొడుక్కు లాస్టియర్ పెళ్లి చేసింది," అంది.

మూర్తి వాళ్ల తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. ముసలాళ్లను బలవంతంగా అనంతపురం తీసుకొచ్చేవాడు. అప్పుడప్పుడూ రాణి వాళ్ల అమ్మానాన్న కూడా వచ్చి వెళ్లేవాళ్లు. వాళ్లున్నన్నాళ్లూ తనని సరిగా పట్టించుకోవటం లేదని మూర్తి యాగీ చేయడం గుర్తొచ్చింది రాఘవకు. 'ఇల్లు

ఓల్టేజి హోమైపోయింది,' అని అరిచేవాడట. 'పోనీ షిఫ్ట్ సిస్టమ్ పెట్టు,' అన్నాడు రాఘవ ఆమెను ఊరడించడం కోసం.

తింటూనే, మాటలు కదపడం కోసం రాణికేసి చూశాడు రాఘవ. ఆవిడ చూపులు గాలిలో వేలాడుతున్నాయి. పెళ్లయిన తరువాత, రాఘవ వాళ్లింటికి వెళ్లడం తగ్గించిన తరువాత కూడా వారానికో, పదిరోజులకో అతడి కోసం డిపార్టుమెంటుకొచ్చి ఇలాగే మౌనంగా కూచునేది. ఆవిడలా మౌనంగా ఉన్నపుడు ముళ్లపైన కూచున్నట్లే ఉండేది రాఘవకు. క్రమంగా అలా మౌనంగా ఉన్నా ఆవిడ తనతో ఏదో కమ్యూనికేట్ చేస్తున్నట్టు అనిపించసాగిందతనికి.

టిఫిను తినడం ముగించి డ్రాయింగ్‌రూం కొచ్చాక పాత ఇంగ్లీషు దినపత్రికను అందిస్తూ, "అబిచ్యురీ కూడా వేయించాం," అంది రాణి.

నెలరోజుల క్రితం పత్రిక అది. ఏడో పేజీలో క్రాస్ వరల్డ్ పజిల్ పక్కన రెండు కాలాల పొడవూ వెడల్పున్న చతురస్రాకారపు ప్రకటనలో మూర్తి ఫోటో అదే పెదవి విరుపుతో పలకరిస్తోంది. దానికింద మౌర్న్‌డ్ బై అంటూ వరుసగా మిసెస్ శకుంతలా రాణి సీతారామచంద్ర మూర్తి, మిసెస్ కిరణ్మయి, మిస్టర్ శ్రావణ్ కుమార్, బేబీ నికిత అని పేర్లున్నాయి. పెళ్లయిన మూడునెలల తరువాత రాణి అటెండెన్సులో తన పేరు మార్చమని అప్లికేషను పెట్టిందని తెలిసింది రాఘవకు. గవర్నమెంటు గెజిట్‌లో పేరు మార్చినట్టు వచ్చిన వర్తమానపు జిరాక్సు కూడా పంపిందట రాణి. 'మూడు నెలలుగా మూర్తి ఈ పనిలోనే ఉన్నాడు. గెజిట్ వచ్చాకగానీ నిద్రపోలేదు,' అందామె. అప్పటి నుంచీ ఆమె శకుంతలారాణీ సీతా రామచంద్రమూర్తి అని అన్ని అక్షరాలూ స్పష్టంగా కనబడేలా వివరంగా సంతకం చేసేది. ఆమె హెడ్డయ్యాక, రెండు వందలమంది పిల్లల పరీక్షల అప్లికేషన్లలో అయిదు వందల సంతకాలు చేస్తున్నపుడు ఆవిడే పెద్ద పరీక్ష రాస్తున్నట్టుగా కనిపించేది రాఘవకు. 'మీ ఆయన సంతకంలో ఫ్యామిలీ ప్లానింగ్ చేస్తున్నట్టుగా మూడే అక్షరాలూ చిన్న గీతా ఉంటాయి,' అన్నాడు రాఘవ. ఆమె నీరసంగా నవ్వి, 'ఆయనది సిగ్నేచరు. నాది డిక్లరేషను,' అంది.

"లిబియా యూనివర్సిటీవాళ్లు కండొలెన్సు పంపారు," అంటూ రాణి పెద్ద కవరును రాఘవకు అందించింది. మూర్తికి తాను పనిచేసిన అన్ని యూనివర్సిటీలతోనూ అన్నిరకాల సమాచార సంబంధాలున్నాయని రాఘవకు బాగా తెలుసు. హైదరాబాదు ఎప్పుడు ఫోన్ చేసినా మూర్తే తీసేవాడు. తన సెమినార్ల గురించీ, ప్రాజెక్టుల గురించీ గంటల తరబడీ ఊదరగొట్టేవాడు. రాణిని గురించి అడిగినప్పుడల్లా, 'బ్రహ్మాండంగా ఉంది. నువ్వు ఫోన్ చేశావని చెప్తాన్లే,' అనేవాడు. వాళ్లు అనంతపురం వచ్చిన విషయం ఎలాగో తెలిసినప్పుడు గెస్టు హౌస్‌కు వెళ్తే, 'మా ప్రజెంట్ హెడ్ డిన్నరుకు రమ్మని చంపేస్తున్నాడు. ఈసారి వచ్చినప్పుడు తీరిగ్గా కలుద్దాం,' అనేవాడు రాఘవతో. మూర్తి లేకుండా రాణి కనిపించడం ఎప్పుడోగానీ కుదిరేదికాదు. అలా కుదిరినప్పుడు ఇద్దరూ ఇలాగే మౌనంగా కూచునేవాళ్లు.

లిబియా యూనివర్సిటీ వాళ్ల ఉత్తరం ఖరీదుగా తళతళలాడుతోంది. అదేమంత ధనవంతమైన దేశం కాకపోయినా వాళ్లు పెద్ద పెద్ద జీతాలపైన విదేశాల్నుంచీ నిపుణుల్ని రప్పించుకుంటారట! ఫారెన్ రిటర్న్‌డ్ అనిపించుకోవాలని ప్రపంచంలోని పెద్ద యూనివర్సిటీ లన్నిటికీ అప్లికేషన్లు పెట్టాడు మూర్తి.

లిబియా నుంచీ మాత్రమే ఆహ్వానం వచ్చింది. అది కూడా తనకొక్కడికే! జీతం వదులుకునే షరతుపైన రాణి చేత సెలవు పెట్టించి, లిబియాకు బయల్దేరాడు మూర్తి. అప్పటికి కిరణ్మయి ఏడాది బిడ్డ. అక్కడ రెండేళ్లుండి తర్వాత అనంతపురం యూనివర్సిటీవాళ్లు ఒప్పు కోకపోవడంతో తిరిగొచ్చారు. అక్కడ రాణి ఏదో చిన్న పిల్లల బడిలో పనిచేసిందట. అప్పుడు రాణికిచ్చిన జీతం ఇక్కడి జీతం కంటే రెండింతలని మూర్తే టాంటాం వేశాడు. పైగా, 'రాణి మళ్లీ లిబియా వెళ్లాలం టోంది. ఉయ్ హాడ్ ఏ గ్రేట్ స్టే దేర్,' అనేవాడు. భర్త పక్కనున్నప్పుడు రాణి బిక్కుబిక్కుమంటూ ఉండడం, అతను వెళ్లగానే ఆమె తెరపినబడటం రాఘవకు ఎబ్బెట్టుగా కనిపించేది.

రెండవ కాఫీ తీసుకొచ్చి ఇస్తూ, "మాధవి బావుందా?" అని అడిగింది రాణి.

తల ఊపుతూ, "రావాలంది. ఈసారి తీసుకొస్తాను," అన్నాడు రాఘవ.

"ముసలివాళ్లను చూడ్డం ఇష్టం లేదేమో!" అంది రాణి తటాలున.

రాఘవ ఉలిక్కిపడ్డాడు. ఆవిడ ముఖంలో చిన్న నవ్వేదో తొంగిచూసింది. పెళ్లయ్యాక ఆమె పెద్దగా మాట్లాడడం, బిగ్గరగా నవ్వడం బలవంతంగా మానేసినట్టు రాఘవ గమనించాడు.

"ముసలివాడి భార్య కూడా ముసలిదే మరి!" అని నవ్వేశాడు.

కిరణ్మయి మూడేళ్ల పాపాయిగా ఉన్నప్పుడు దాన్ని కూడా ఫ్యాకల్టీ క్లబ్బుకు తీసుకొచ్చేది రాణి. రాఘవ దానితో ఆడుకుంటూంటే, 'పిల్లలంటే ఇష్టమున్నట్లయితే పెళ్లి చేసుకోవచ్చు గదా!' అంది. రాఘవ నవ్వేసి, 'సగం బట్టతల వచ్చేసింది. నన్నెవరు చేసుకుంటారు?' అన్నాడు. తర్వాత మరచిపోయిన విషయం జ్ఞాపకం వచ్చినట్టుగా, 'ఎలాగూ నన్ను కజిన్ను చేశావుగదా! పెద్దయ్యాక దీన్నే చేసుకుంటాను,' అన్నాడు. రాణి చేతిని పెదవుల పైన పెట్టుకుని నవ్వునాపుకుంది. కిరణ్మయి నర్సరీలో చదువుతున్నప్పుడు మాధవి కొంగు పట్టుకుని తిరిగేది. రాఘవను ఎగతాళి చేయడం కోసం, 'జాగ్రత్త మాధవీ! నువ్వు చెప్పిన మాట వినకుంటే మీ ఆయన నా కూతుర్ని పెళ్లి చేసుకుంటానంటాడు,' అని కవ్వించేది రాణి. ఆ పిల్ల కూడా రాఘవ ఒడిలోకెక్కి కూర్చుని, 'పెళ్లంటే ఏమిటంకుల్?' అని అడిగేది. మాధవి కిరణ్మయి కిష్టమని చికెన్ చేసి పెట్టేది. రాణికి రహస్యంగా ఇవ్వమని చిన్న కారియర్ తీసి రాఘవ లంచ్‌బాగ్‌లో సర్దేది. తన పెళ్లయ్యేవరకూ కిరణ్మయి మాత్రం మాధవికి తరచుగా ఫోనుచేస్తూ ఉండేదని రాఘవకు తెలుసు.

"రాత్రంతా బస్సులో నిద్రలేదేమో! పడుకుంటావా?" అని రాణి అంటూనే రాఘవ పక్కగదిలోకి దూరేశాడు. ఆవిడలా మౌనంగా ఉన్నప్పుడు ఏదో ఆలోచిస్తూ ఉంటుందని అర్థమయ్యేది. మూర్తి పొడవాటి వాక్యాల మధ్య ఆవిడ గొంతు కనిపించీ కనిపించని విరామచిహ్నాల్లా పలికేది. రాణి ఉమెన్స్ హాస్టల్ వార్డెను గా ఉన్నప్పుడు ఆడపిల్లలంతా ఒకసారి పెద్ద స్ట్రైక్ చేశారు.

ఏ అమ్మాయి ఏ పనిపైన క్వార్టరుకు వెళ్ళినా ముందుగా మూర్తితోనే మాట్లాడాల్సి వచ్చేదట! వార్డెను రాణా, ఆమె భర్తా తేల్చమని వాళ్లు గొడవకు దిగారు. ఈ పెద్దమనిషి ఏ ఆడపిల్లతోనో ఏదో చొరవచేసి ఉంటాడనీ, లేకపోతే ఇంత రాద్ధాంతమెందుకవుతుందనీ అందరూ చెవులు కొరుక్కున్నారు. పెద్దగా కారుబారు చేస్తూ రాణి రాజీనామాను ప్రిన్సిపాలు ముఖంపై కొట్టిందట! ఎప్పుడూ పెద్దగా మాట్లాడని వ్యక్తి అంత ఆగడం చేసిందంటే, దాని వెనక సూత్రధారి వేరే ఉంటాడని అందరూ అనుకున్నారు.

పడక పైన పడుకున్నాక బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాడు రాఘవ. గోడ గడియారం తప్ప ఇంట్లోంచీ మరో సవ్వడి వినరావడం లేదు. గోడ మీది ఫోటోలో చిన్నారి కిరణ్మయి డాన్సు చేస్తోంది. ఫోటోలో ఆ పిల్ల పీజీ చదువుతున్నప్పటి రాణిలాగే కనబడుతోంది. 'నా డాటర్ బ్రిలియంట్. అంతా నా పోలికే!' అనేవాడు మూర్తి. గురి చూసి వదిలిన బాణంలా ఆ అమ్మాయి కోరుకున్న చదువుకు దూసుకెళ్ళి, అక్కడ కూడా రికార్డు బ్రేక్ చేసింది. కిరణ్మయి తన క్లాస్‌మేటును పెళ్లి చేసుకుంటానన్నప్పుడు మూర్తి ఇల్లు పీకి పందిరేశాడు. కిరణ్మయి అలిగి రాఘవ ఇంటికొచ్చేసింది. మూర్తి అందరి ముందూ రాణిని ముద్దాయిగా నిలబెట్టాడు. చివరకు పెళ్లిపనులన్నీ రాఘవ పైనే పడ్డాయి. ఏ ఖర్చు పెట్టాలన్నా మూర్తి గొణిగేవాడు. అతడికి తెలియకుండా డబ్బులివ్వడం రాణికెలా కుదురుతుంది? ఆవిడ చెక్కు బుక్కులూ, పాసు పుస్తకాలూ అన్నీ మూర్తి బీరువాలోనే ఉండేవి. 'మొగుడంటే యావజ్జీవ కూలీ అనా అర్థం?' అని మూర్తి తరచుగా విసుక్కునేవాడు. కిరణ్మయి పెళ్లయ్యాక, 'నిజంగానే నీ కూతురుకు వాళ్ల నాన్న జీన్సొచ్చాయి. పట్టిన పట్టు వదలదు,' అన్నాడు రాఘవ రాణితో.

వంటగదిలో కుక్కరు వినయంగా ఈల వేస్తోంది. గది లోపల ఫాను అప్పుడప్పుడూ గొంతు పెగల్చడానికి ప్రయత్నిస్తోంది. గోడ గడియారం నియమబద్ధంగా నిశ్శబ్దానికి గాట్లు పెడుతోంది. గోడ పైనున్న మరో ఫోటోలో కాన్వొకేషను గౌనులో ఉన్న మూర్తి గవర్నరు వెంట డీన్ హోదాలో నడుస్తున్నాడు. కొత్తగా యూనివర్సిటీ వాళ్లు పీస్ అండ్ నాన్ వయలెన్స్ ప్రాజెక్టు ప్రారంభించి దానికి ప్రొఫెసరు స్థాయి డైరెక్టరు పోస్టుకు ప్రకటనివ్వడం రాఘవకు గుర్తుకొచ్చింది. ఇంటర్వ్యూలో రాణి సులభంగానే సెలక్టయ్యింది. సరిగ్గా అదే సమయంలో జరిగిన ప్రొఫెసర్ల ఇంటర్వ్యూలలో మూర్తికి రావాల్సిన ప్రమోషన్‌ను మరో వ్యక్తి తన్నుకుపోయాడు. రాణి ఇప్పుడూ రేపూ అంటూ డైరెక్టరుగా చేరడాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. ఆరు నెలల తర్వాత, 'అయినా ఆ లూపులైనులో కెవరెల్తార్లే!' అని తేల్చి పారేసింది. లూపు లైను అనే మాట మూర్తి ఊతపదమని రాఘవకు బాగా తెలుసు.

మరచిపోయిన విషయాన్ని జ్ఞాపకం చేసుకుంటున్నట్టుగా గడియారం గంటలు కొట్టింది. "ఆకలిగా వుంటే నిద్రపట్టదు. లే... లంచ్ రెడీ," అంటూ రాణి గదిలో కొచ్చింది.

"నువ్వా తినేసెయ్యి!" అన్నాడు రాఘవ.

ఆవిడ తల ఊపుతూ, "ఒంటరిగా తినడం అలవాటు చేసుకుంటున్నాన్లే," అంది. పెళ్లయిన మర్నాటి నుంచీ మూర్తి లేకుండా రాణి ఒంటరిగా కనిపించేది కాదు. అతనే సెమినారు కెళ్ళినా

ఆమెను వెంటబెట్టుకెళ్లే వాడు. 'నాకిప్పుడు ఫిలాసఫీ వాళ్ల కంటే బొటానిస్టులే ఎక్కువగా తెలుసు,' అనేది రాణి. రిటయిరయ్యాక కూడా అనంతపురం సెమినార్లకు తప్పకుండా వచ్చే వాడు మూర్తి. రాణీ వాళ్ల ఫిలాసఫీ డిపార్టుమెంటు వాళ్లొకసారి ఆమెనో సెమినారు కీనోట్ అడ్రెస్సుకు పిలిచారు. వస్తానంటూనే చివర్లో ఆరోగ్యం బాగాలేదని ఎగ్గొట్టేసిందామె. అప్పటినుంచీ వాళ్లు ఆమెను పిలవడమే మానేశారు.

రాఘవ ఫ్రిజ్ పైన ఉన్న ఫోటోను చూస్తూండగా, "పెన్షను పేపర్ల కోసం తీసుకున్న ఫోటో అది," అంది రాణి.

ఫోటోలో మూర్తి కంటే ఆమె రెండు మూడేళ్లు చిన్నదిగా కనబడుతోంది. ఆమె మూర్తి కంటే ఏడాది ముందుగా రిటైరయినప్పుడు కానీ నిజమేమిటో రాఘవ కైనా తెలిసింది  కాదు. 'టీచరుగా ఉన్నవాళ్లే కూతురు పుట్టిన తేదీ తప్పుగా రాయిస్తారా?' అంటూ మూర్తి ఎద్దేవా చేశాడు, ఎవరో చేసిన తప్పుకు తాను శిక్షననుభవిస్తున్నవాడిలా.

"రోడ్డు పక్కనే ఉన్నా మీ ఫ్లాట్లోకి శబ్దాలు రావడం లేదు రాణీ!" అన్నాడు రాఘవ మాటలు కదపడం కోసం.

"ఈ బ్లాకుకూ రోడ్డుకూ మధ్య రెండు వరసల ఫ్లాట్లున్నాయనే దీన్ని కొందామన్నాడాయన. ఎప్పుడూ టీవీ ముందే కూచునేవాడు. ఆ న్యూస్‌రీడర్లు ఇంట్లో తిరుగుతున్నట్టే ఉండేది," అంది రాణి. తన డిపార్టుమెంటుకొచ్చి మౌనంగా కూచుని వెళ్లిపోయే రాణికీ, ఇప్పటి రాణికీ మధ్య తేడా లేనట్టే అనిపించసాగింది రాఘవకు. చాలారోజుల తర్వాత కనిపించినా నిన్నే కలిసిన వ్యక్తిలా పలకరించేది రాణి. తానూ అదేలా మాట్లాడడం తనకలవాటైపోయిందని రాఘవ గుర్తించనే లేదు.

భోజనం చేశాక వళ్లు తెలియకుండా గంటపైగా నిద్రపోయిన రాఘవతో, "మనకు తెలియ కుండానే వయసొచ్చేస్తోంది గదా మనకు! తిరుపతిలో రోజుల తరబడీ నిద్ర మేలుకునేవాడివి," అంది రాణి నవ్వుతూ.

టీ తాగుతూ, "కిరణ్ కంపెనీ మారిందా?" అని వాకబు చేశాడు రాఘవ.

"ఈ కంపెనీ వాళ్లేదో ప్రమోషనిచ్చి, సాలరీ హైక్ ఇచ్చారని ఒప్పుకుంది. పైగా ఇక్కడ మేమున్నాము గదా!..." అంది రాణి. కాస్సేపయ్యాక, "శ్రావణ్ కూడా ట్రాన్స్‌ఫర్ చేసుకుంటాడనే అంటోంది. నాకైతే అనుమానంగానే ఉంది. ఫోన్లలోనే గొడవ పడుతున్నారు," అంది రాణి.

డ్రాయింగ్ రూం అలమారు నిండా బాటనీ పుస్తకాలూ, జర్నల్సూ ఉన్నాయి. మూర్తి పేరు రంగు పెన్సిళ్లతో దిద్దడంతో అన్ని జర్నల్లలోనూ అతని వ్యాసాలున్నాయని తెలిసిపోతోంది. కాస్సేపటి తర్వాత రాణి వచ్చి, "నేను కాన్వెంటుదాకా వెళ్లొస్తాను రాఘవా! నిక్కీని పొద్దున తీసుకెళ్లి వదిలిపెట్టి సాయంకాలం తిరిగి తీసుకొచ్చేవారాయన. ఇప్పుడా పని నాది," అంది.

పుస్తకాలు తిప్పుతూనే తల ఊపాడు రాఘవ. రాణి కాస్త దూరం వెళ్లేవరకూ ఆవిడ చెప్పుల శబ్దం వినిపించింది. తర్వాత మళ్లీ నిశ్శబ్దమే ఆవహించింది. ఫోటోలోని మూర్తి ఎప్పటిలాగే గొంతు

చించుకుంటూనే ఉన్నట్టూ ఇల్లు గొంతు నొక్కుకుంటున్నట్టూ అనిపించింది రాఘవకు. ఉన్నట్టుండి ఇంటి లోపలెక్కడో కొళాయిలోంచీ నీళ్లు బొట్లుబొట్లుగా రాలుతున్న శబ్దం మొదలయ్యింది. దూరంగా లిఫ్టు తెరుచుకుంటున్న సవ్వడి. హైహీలు చెప్పులు టకటకలాడిస్తూ కిరణ్మయి అసురుసురంటూ లోపలికొచ్చింది. ల్యాప్‌ట్యాప్ సంచిని లోపల పడేసి, ఫ్రిజ్జులోంచీ నీళ్లసీసా తీసుకుని కొద్ది కొద్దిగా నీళ్లు తాగుతూ సోఫాలో కూచుని, "థాంక్యూ అంకుల్... వెళ్లిపోతారేమోనని కంగారుపడ్డాను," అంది. కాసేపయ్యాక, "సరిగ్గా సమయానికొచ్చారు మీరు! నాకో చిన్న హెల్ప్ చేసి వెళ్లండి," అంది.

"నేనా? హెల్పా? ఏమిటి?" రాఘవ కంగారుపడ్డాడు.

"నేను శ్రావణ్‌తో డైవోర్సు తీసుకుంటున్నాను," ఉపోద్ఘాతమేమీ లేకుండా కిరణ్మయి చెప్పుకుపోసాగింది. "ఈ మాట మమ్మీకి చెప్పాలంటే కంగారుగా ఉంది. అసలే తను డిప్రెషనులో ఉంది. కానీ ప్రాసెస్ స్టార్టయి పోయింది. కోర్టు నుంచీ పేపర్లు ఇప్పుడో రేపో రానే వచ్చేస్తాయి. ఈలోగా మమ్మీనెలా దీనికి రెడీ చేయాలా అని నాలుగైదు రోజులుగా తనకలాడుతున్నాను. ఇంతలో మీరొచ్చారు. ఉన్నట్టుండి తెలిస్తే షాకవుతుందని భయంగా ఉంది. మీరే ఎలాగైనా ఐస్ బ్రేక్ చేయాలి..."

రాఘవ కంగారుగా, "డైవోర్సెందుకు?" అని అడిగాడు.

"ప్రమోషనూ, కంపెనీ మారడమూ శ్రావణ్‌కిష్టం లేదు. ఇక్కడికి నేనొచ్చే ముందు పెద్దగా గోల చేశాడు. అలిగి రెండు నెలలు ఫోను కూడా చేయలేదు. ఇప్పుడు మా ఆఫీసువాళ్లు నాకు ఇంకో హైక్ ఇచ్చి ఫారిన్ పంపుతున్నారు. శ్రావణ్ డైవోర్సంటు బెదిరించబోయాడు," అంది కిరణ్మయి.

ఫోటోలోని మూర్తిని భయంగా చూస్తూ, "తొందరపడకు కిరణ్. పర్సనల్ లైఫ్ కంటే ప్రమోషన్లు గొప్ప కాదు. నికిత గురించి ఆలోచించు. ఈ సంగతి తెలిస్తే మీ అమ్మ అప్‌సెట్ అవుతుంది," అన్నాడు రాఘవ.

"పర్సనల్, కెరీర్ డిఫరెంట్ కావంకుల్. పేషన్ లేకుండా ఏమి చేసినా సక్సెస్ రాదు. నిక్కీ కాన్వెంటు కెళ్తోంది. మమ్మీ దాన్ని చూసుకుంటుంది. నెమ్మదిగా మమ్మీ కూడా అర్థం చేసుకుంటుంది. మీరు మెల్లగా న్యూస్ బ్రేక్ చేసి వెళ్తే చాలు," అంది కిరణ్మయి.

"ఇంతమాత్రానికే డైవోర్సుదాకా వెళ్లాలా? దేన్నయినా తెగేవరకూ లాగకూడదు. దేనికైనా ఒక కాంప్రమైజ్ ఉంటుంది. కావలిస్తే నేను శ్రావణ్‌తో మాట్లాడతాను," అన్నాడు రాఘవ. ఆవిడ మౌనంగా ఉండిపోవడంతో, "డైవోర్సు తీసుకునే ఆడవాళ్లను సొసైటీ అదోలా చూస్తుంది కిరణ్!" అన్నాడు బెదిరించే ధోరణిలో.

కిరణ్మయి అదోలా చూసి, "మా ఆఫీసంతా ఆడవాళ్లే అంకుల్! ఎవరు ఎవరిని పెళ్లి చేసుకున్నారో, ఎవరు డైవర్సీలో ఎవరూ పట్టించుకోరు... అంత తీరికెవరికీ లేదు," అంది. తరువాత, "ఒకవేళ పట్టించుకున్నా నాకే ఇబ్బందీ లేదు," అంది.

రాఘవ ముఖం చిట్లించుకుని, "ఇంకా నీకు ముప్ఫయి నిండలేదు. ఇప్పటి నుంచీ ఒంటరిగా జీవిస్తానంటే, పెద్దవాళ్లం, మేమెలా ఒప్పుకుంటాం?" అని కసిరాడు.

"ఎప్పుడైనా తోడు కావాలనిపిస్తే అప్పుడు ఆలోచిస్తాన్లే అంకుల్!" అని కాసేపాలోచించి, "ఇలా ఏ ఉద్యోగం చేసే వ్యక్తినో కాకుండా, ఏ రిటైరైనవాణ్ణో చేసుకుంటాన్లే అప్పుడు," అంది అన్యమనస్కంగా. అంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్టుగా సిగ్గుపడి, ఆ తరువాత పెద్దగా నవ్వేసింది. అంత పెద్ద వయస్సులోనూ రాఘవ కూడా సిగ్గుపడుతూ నవ్వేశాడు.

"మమ్మీ వస్తోందంకుల్. ఇప్పుడే చెప్పేసెయ్యండి," అంది కిరణ్మయి.

దూరం నుంచీ లిఫ్టు మూసుకున్న శబ్దం వినవస్తోంది. తాను ఫిలాసఫీ డిపార్టుమెంటులో కూచున్నపుడు ఇలాగే రాణి ఉన్నట్టుండి లేచి నిల్చుని, 'ఆయనొస్తున్నాడు రాఘవా!' అనడం రాఘవకు జ్ఞాపకం వచ్చింది. అతనెక్కడో మెట్లెక్కుతున్న శబ్దం ఆమెకంత స్పష్టంగా ఎలా వినబడేదో అతడికర్థమయ్యేది కాదు. మూర్తి నిలబడి ఉండగా రాణి కూచోవడం రాఘవెప్పుడూ చూడలేదు.

నికిత పరుగున వచ్చి తల్లి ఒళ్లో కూచుంది. స్కూల్ బ్యాగ్‌ను మోసుకుంటూ వెనకే వచ్చిన రాణి సోఫాలో కూచుంది. కిరణ్మయి పాపాయిని తీసుకుని లోపలికెళ్లింది.

కాసేపు గడిచాక, "కిరణ్ ఏమంటోంది?" అని అడిగింది రాణి.

రాఘవ ఇంటి లోపలికి చూస్తూ, "నువ్వూహించింది నిజమే రాణీ! వాళ్లిద్దరూ కీచులాడు కుంటున్నారు. ఇప్పుడు విడాకుల వరకూ వచ్చారు. కిరణ్ నీకీ సంగతెలా చెప్పాలా అని కంగారు పడుతోంది," అన్నాడు.

చాక్లెట్ తింటున్న పాపాయి నెత్తుకుని వచ్చి కిరణ్మయి మళ్లీ సోఫాలో కూచుంది. చాలాసేపు ఎవరూ మాట్లాడలేదు. నిశ్శబ్దాన్ని భరించలేక, వాతావరణాన్ని తేలికపరచడం కోసం, "చిన్నప్పుడు కిరణ్‌కు పెళ్లంటే ఏమిటో అర్థం చెప్పలేక అవస్థ పడేవాణ్ణి గదా! ఇప్పుడు డైవోర్సంటే ఏమిటో చెప్పాల్సి వస్తోంది," అన్నాడు రాఘవ. తల్లీ కూతుళ్లిద్దరూ మరికాసేపు మౌనంగా ఉండిపోవడంతో, "అంతగా ఎప్పుడైనా తోడు కావలిస్తే ఏ రిటైరైనవాణ్ణో పెళ్లి చేసుకుంటానని దబాయిస్తోంది," అంటూ తన జోక్‌కు తనే నవ్వబోయాడు.

కిరణ్మయి ముడుచుకున్న ప్రశ్నార్థకపు గుర్తులా కూచుంది.

రాణి ముఖంలోంచీ చిత్రమైన నవ్వేదో తనను పరిహాసం చేసినట్టు అనిపించగానే, తన బాణం గురి తప్పి తనకే తగిలినట్టుగా తబ్బిబ్బుపడుతూ రాఘవ తల వంచుకున్నాడు.

ఉన్నట్టుండి పెదవుల శబ్దం పెద్దగా రావడంతో ఉలిక్కిపడి తల పైకెత్తి చూశాడతను. రాణి కూతురి నుదుటి పైన గట్టిగా ముద్దుపెట్టి ఇంటిలోపలికి వెళ్లిపోతూ కనిపించింది.

ఆదివారం ఆంధ్రజ్యోతి, 27 జులై 2014